నేడు దిశ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశా) కమిటీ సమీక్షా సమావేశాన్ని జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ, పిఎం ఆవాస్ యోజన, గ్రామ సడక్ యోజన, జాతీయ రహదారులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, మైనార్టీ సంక్షేమానికి సంబంధించిన పథకాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు.

దొడ్డిదారిన నల్లచట్టాల అమలు

- నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి
- రైతుసంఘాల సమన్వయ సమితి డిమాండ్
- జిఒ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తామని చెప్తూ, దొడ్డిదారిన ఆ చట్టాలనే అమలు చేస్తూ రైతులను మోసం చేస్తోందని రైతుసంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ వ్యయసాయ మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ఆపాలని తదితర డిమాండ్లతో ఆలిండియా కిసాన్ సంయుక్త మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం నిరసన చేపట్టారు. నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందన్నారు. కార్పొరేట్ల కోసం డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, నూతన సహకార చట్టం, నూతన మార్కెట్ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. రైతుసంఘాలు కోరుతున్న సి2, 50 మద్దతు ధరల చట్టం, రుణమాఫీ చట్టం, రైతుల, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల పెన్షన్ కల్పిస్తూ చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మోడీ ఇచ్చిన హామీ మేరకు రైతు పండించిన అన్ని పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. అందుకోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్లచట్టాల రద్దు కోసం రైతులు చేసిన పోరాట కాలంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామన్న హామీ కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్న రైతులపై నిర్బంధం ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల ఢిల్లీ సరిహద్దు శంభూ బోర్డర్‌లో రైతు ఉద్యమ నాయకులపై కేంద్ర ప్రభుత్వ పాశవిక దాడిని తీవ్రంగా ఖండించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఉద్యమ నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌కు హాని జరిగితే కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. తక్షణమే ఎస్‌కెఎం నాయకులతో ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరపాలన్నారు. రైతులపై జరుగుతున్న దమనకాండను ఆపాలని, అరెస్టు చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ రైతులకు క్షమాపణలు చెప్పి, రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రైతు అనుకూల విధానాలను అవలంభించి రైతును, వ్యవసాయ రంగాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, ప్రగతిశీల దళిత వేదిక జిల్లా కార్యదర్శి బి.బాలు, ప్రజాసంఘాల నాయకులు కె.అప్పారావు, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు ఎన్.గణపతి, సిహెచ్.వేణుగోపాల్, ఎం.రామారావు, జి.బాలకృష్ణ, ఎం.వినోద్ కుమార్, టి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రైతు, ప్రజాసంఘాల నాయకులు


పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకులు ఎం.వి శేషగిరిబాబు

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ

- 'స్వీప్' కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఓటరు జాబితా పరిశీలకులు ఎం.వి శేషగిరిబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, లావేరు

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఓటర్ల జాబితా పరిశీలకులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఐజి ఎం.వి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2025పై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సవరణ ప్రక్రియ సందర్భంగా వచ్చిన క్లయిమ్‌లు, ఆమోదించినవి, తిరస్కరణకు గురైన వాటి గురించి ఆరా తీశారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల భాగస్వామ్య (స్వీప్) కార్యక్రమాలను ఎక్కువ సంఖ్యలో నిర్వహించాలని సూచించారు. అన్ని జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాల ద్వారా పెద్దఎత్తున అవగాహనా సదస్సులు, వర్క్‌షాప్‌లు, పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా క్యాంపెయిన్లు నిర్వహించాలన్నారు. పకడ్బందీగా ఓటర్ల జాబితాలు రూపొందించాలని పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా రాజకీయ పార్టీల నుంచి ఓటరు జాబితా రూపకల్పనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గురించి కలెక్టర్ వివరించారు. ఇప్పటికే డ్రాఫ్ట్ జాబితా సిద్ధమైందని, జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ విడతలో 18 - 19 సంవత్సరాల మధ్య 19,246 మంది యువ ఓటర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా సుమారు 39 వేల మంది ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులుగా ఉన్నారని గుర్తించామని, ఏడాది పొడవునా అలాంటి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ అప్పారావు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, ఎన్నికల డిటిలు, పి.ఎం.జె బాబు (టిడిపి), రౌతు శంకరరావు (వైసిపి), డి.గోవిందరావు (సిపిఎం), కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి (కాంగ్రెస్), భైరి అప్పారావు (బిఎస్‌పి) తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

లావేరు మండలంలోని సుభద్రాపురం పోలింగ్ కేంద్రాన్ని ఓటర్ల జాబితా పరిశీలకులు ఎం.వి శేషగిరిబాబు పరిశీలించారు. ఫారం-6, 7, 8ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌డిఒ సాయిప్రత్యూష, ఎచ్చెర్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణమూర్తి, లావేరు, రణస్థలం తహశీల్దార్లు తదితరులున్నారు.

అదే అయితే అప్పలరాజుకు జైలు ఖాయం

- హత్యా రాజకీయాలకు తెర తీశారు
- సుపారీ ఇచ్చింది మీ మనుషులు కాదా?
- మాజీ మంత్రి సీదిరి సమాధానం చెప్పాలి
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

టిడిపి పట్టణాధ్యక్షులు నాగరాజు హత్యకు బీహార్ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చిన కేసులో విచారణ సాగుతోందని, ఇందులో మాజీ మంత్రి అప్పలరాజు పాత్ర ఉందని తేలితే జైలుకెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాసలో హత్యా రాజకీయాలకు వైసిపి నాయకులు తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి పట్టణాధ్యక్షులు బడ్డ నాగరాజు హత్యకు బీహార్ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చింది తన మనుషులు కాదని అప్పలరాజు చెప్పగలరా అని ప్రశ్నించారు. నాగరాజు హత్య కుట్రలో 17 మంది నిందితులు అప్పలరాజు, ఆయన భార్యతో కలిసి దిగిన ఫొటోలను విలేకరులకు చూపించారు. వైసిపి నాయకులను పోలీసులు అరెస్టు చేసిన సమయంలో పోలీస్‌స్టేషన్ వద్ద అప్పలరాజు బైఠాయించిన సమయంలోనూ ఆయనతో ఒక నిందితుడు ఉన్నారని తెలిపారు. హత్యకు కుట్రలో ఆయన ధన సహాయం చేసి ఉంటారని ఆరోపించారు. తమ నాయకులు, కార్యకర్తలపై చిన్న గీత పడినా అప్పలరాజే బాధ్యుడన్నారు. గతంలో ఎంతోమంది నాయకులు ఈ నియోజకవర్గాన్ని పాలించారని, ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడలేదన్నారు.

గత ఐదేళ్లలో అప్పలరాజు చేసిన అభివృద్ధి ఏమీ లేదని, టిడిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతూ కేసులు బనాయించారని చెప్పారు. ఇద్దరు మైనర్లపై అత్యాచార ఘటనలో నిందితులు తన వద్దకు వచ్చారని బురదజల్లారని, దాన్ని నిరూపించగలరా అని ప్రశ్నించారు. పలాస ప్రాంతాన్ని ప్రశాంతంగా చూడాలన్న ఉద్దేశంతో అధికారంలో ఉన్నా ఎటువంటి రాజకీయ కక్షలు, వేధింపులకు పాల్పడడం లేదని చెప్పారు. ఇంతవరకు సహనంగా ఉన్నామని, ఇకపై పరిస్థితి అలా ఉండదన్నారు. సమావేశంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, జి.కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజుతో నిందితులు ఉన్న ఫొటోలను చూపిస్తున్న శిరీష తదితరులు

ఉద్దానాన్ని ధ్వంసం చేయొద్దు

- కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను విరమించుకోవాలి
- వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- 'మీకోసం'కు 77 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరానికి ఆనుకుని 20 గ్రామాల రైతుల నుంచి భూములు లాక్కొని కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామనడం సరికాదని, అందువల్ల ఆ ప్రాంతంలో పచ్చని ఉద్యాన పంటలను సంరక్షించి రైతులను ఆదుకోవాలని ఉద్దాన ప్రాంత రైతులు కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం నిర్వహించిన మీకోసంలో మందస మండలం మండలం గుంగువాడ, బిడిమి గ్రామాలకు చెందిన రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్దాన తీర ప్రాంతంలో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం వల్ల జీవన మనుగడే ప్రశ్నార్థమవుతుందని వివరించారు. ఈ ప్రాంతంలో కొబ్బరి, జీడి, మునగ, పనస వంటి ఉద్యాన పంటలను సాగుచేస్తూ జీవనోపాది పొందుతున్నామని అన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని కోరారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత సమస్యలతో కూడిన 77 వినతులు వచ్చాయి. తుపాను వల్ల కురిసిన వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, తక్షణమే ఆదుకోవాలని ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కోరారు. కవిటి మండలం ఈదుపురం, కొత్తూరుకు చెందిన బాలరాజు, ఈశ్వరరావు, రైతులు వచ్చి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వర్షాపు నీటిలో ఇప్పటికి వరి చేసు మునిగి ఉండడం వల్ల ధాన్యం రంగు మారుతున్నాయని వినతిపత్రాలను అందజేశారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు చెందిన రైతులు మల్లా సురేష్, బోగిన సన్యాసిరావులు కోరారు. సర్వే పేరుతో పింఛన్లు తొలగించేందుకు గ్రామాల్లో కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఢిల్లేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ అప్పారావు, ఉప కలెక్టర్లు లక్ష్మణమూర్తి, పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

పోస్టర్ ఆవిష్కరణ

జనవరి 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు కుష్టు వ్యాధిపై సర్వే చేస్తామని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి వివరించారు. సర్వేకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి అందరూ సహకరించాలని కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ అప్పారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్ర పండగగా రథసప్తమి

- మూడు రోజుల పాటు వేడుకల నిర్వహణ
- ప్రభుత్వం తరుపునే పట్టు వస్త్రాల సమర్పణ
- శారదా పీఠం నుంచి ఇక వద్దు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీన నిర్వహించనున్న రథసప్తమి వేడుకల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నుంచి రథసప్తమి వేడుకలు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆలయ పరిసరాల్లోనే అలంకరణ ఉండేదని, ఇకపై శ్రీకాకుళం నగరమంతటా ఉత్సవ శోభను సంతరించుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రథసప్తమి రోజున స్వామి వారికి విశాఖ శారదా పీఠం నుంచి ఇన్నాళ్లూ పట్టు వస్త్రాలు సమర్పించేవారని, ఇకపై ప్రభుత్వం తరుపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చేతుల మీదుగా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాస్‌పై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలని ఆలయ అధికారులను ఆదేశించారు. డోనర్లు, రూ.500 టికెట్, ఉచిత దర్శనం వారికి డిసిఎంఎస్ నుంచి, విఐపిలకు ఆలయ ముఖ ద్వారం నుంచి ప్రవేశం కల్పించాలన్నారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు సిద్ధం చేయాలన్నారు. ఆలయం ఎదురుగా ఉన్న దుకాణాలు తొలగించాలన్నారు. ఆలయానికి డొనేషన్ ఇచ్చిన వారు జనవరి ఐదో తేదీ లోగా ఆలయ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే డోనర్ కార్డు అందజేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి 300 మీటర్లకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వై.భద్రాజీ, ఇన్‌ఛార్జి డిఆర్ఒ అప్పారావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం

- సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిల్లులు సకాలంలో చెల్లిస్తుండటంతోనే పనులు వేగవంతం అవుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టరేట్‌లో ఉపాధి హామీ, పల్లె పండగ పనుల అమలుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలిసి సోమవారం సమీక్షించారు. తొలుత కలెక్టర్ నియోజకవర్గాలు, మండలాల వారీగా చేపట్టిన పనులను వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై ఆరా తీసి మాట్లాడారు. పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో అందజేయడంతో పనులు వేగవంతం అయ్యాయన్నారు. ఇసుక సమస్య లేదని, సమస్యలు ఏమైనా ఉంటే తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు జిఎస్‌టి, వెండర్‌పై వస్తున్న ఇబ్బందులు తెలిపారు. రానున్న మూడు నెలల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ క్లీనింగ్ సెంటర్లు, సచివాలయ భవనాలకు సంబంధించి ఎంత ఖర్చు అయింది, పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడానికి కావలసిన నిధులు వివరాలు అందజేయాలన్నారు. తద్వారా ఆభవనాలు ప్రజలకు అందుబాటులోకి వస్తామన్నారు. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పరిశుభ్రత చేపట్టాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు, పంచాయతీరాజ్ ఎస్‌సి ఎం.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ భాషా, పంచాయతీరాజ్ ఇఇలు రామకృష్ణ, సూర్యప్రకాష్, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతి పల్లెకూ ఆర్‌టిసి బస్సు

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని ప్రతి పల్లెకూ ఆర్‌టిసి సర్వీస్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కంచిలిలో జె.శాసనంకు కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సు సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ బస్సు సోంపేట నుంచి జె.శాసనంకు వెళుందని అన్నారు. గతంలో రోడ్లు బాగోలేక ఆర్‌టిసి సేవలు నిలిపేశారని అన్నారు. రోడ్డు వేయడంతో బస్సును పునరుద్ధరించామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళాశాల వేళలకు అనుగుణంగా బస్సులు నడిపేందుకు అధికారులతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు శాసనంలో బయలు దేరుతుందని, సోంపేటలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలాస ఆర్‌టిసి డిపో డిఎం రోణంకి సీతారామ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

ఆన్‌లైన్‌లోనే హోటళ్ల లైసెన్స్‌లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆహార పదార్థాల దుకాణాల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, ఫాస్టాగ్‌లను ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలని జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం foscos.fssai.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ పేకర్స్, మాన్యుపేకర్స్ తప్పనిసరిగా foscosలో ఫారం డి-1లో వార్షిక నివేదికను ఏప్రిల్ 31వ తేదీ లోగా సమర్పించాలని స్పష్టం చేశారు. లేకుంటే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, ఫాస్టాగ్ చేస్తామని ఆహార పదార్థాల వ్యాపారస్తుల వద్దకు ఎవరైనా వస్తే వారికి డబ్బులు చెల్లించవద్దని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆర్థికపరమైన లావాదేవీలకు రారని స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ నకిలీ గుర్తింపుకార్డులు చూపిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలా ఎవరైనా వస్తే అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఫోన్ నంబరు 9704009989ను సంప్రదించాలని కోరారు.

బధిరుల క్రికెట్ జట్టుకు జెసి అభినందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ జోన్-1 పరిధిలో నిర్వహించిన టి20 క్రికెట్ పోటీల్లో జిల్లా బధిరుల జట్టు విజేతగా నిలిచింది. విజయం సాధించిన జట్టు సభ్యులను జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సోమవారం అభినందించారు. ఐదు జిల్లాలతో పోటీ పడి ట్రోఫీని సాధించడం గొప్ప విజయమని కొనియాడారు. బధిరుల సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.ఈశ్వరరావు, కార్యదర్శి ఎ.భాస్కరరావు సహా 14 మంది క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. బధిరుల ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీనిచ్చారు.

బధిరుల క్రికెట్ జట్టును అభినందిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి
www.prajasakti.com

మాట్లాడుతున్న షణ్ముఖరావు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రజలు మోయలేని విదంగా పెంచేచారని, తక్షణం పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో సిపిఎం టెక్కలి మండల కమిటీ సమావేశం బి.వాసుదేవరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. అర్హులైన పేదలకు రేషను కార్డులు ఇవ్వాలన్నారు. టెక్కలి పట్టణంలో డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. అన్ని వీధుల్లోనూ తాగునీటి కుళాయిలు వేయాలని డిమాండ్ చేశారు. టెక్కలి పట్టణంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇప్పటి వరకు స్థలాలు చూపించలేదన్నారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో హెచ్.ఈశ్వరరావు, యు.లక్ష్మణరావు, పోలయ్య, చెందనరావు, సుబ్రహ్మణ్యం, దుర్గారావు, ధర్మారావు పాల్గొన్నారు.

హాజరు పట్టికను పరిశీలిస్తున్న గౌతు శిరీష

వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల వార్డులు, వైద్యుల గదులు, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఒక వైపు రోగులు వైద్యుల కోసం నిరీక్షిస్తూ ఉండగా, మరో వైపు ఒక్కరే వైద్యుడు ఉండడం చూసి ఆవేశంతో ఊగిపోయారు. ఆస్పత్రికి రాని డాక్టర్ల వివరాలను తెలుసుకుని వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరుగురు వైద్యులు విధుల్లో ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉండడంపై మండిపడ్డారు. గత పాలకులు ఈ అంశంలో చూసీచూడనట్లుగా వ్యవహరించే వారని, ఆ పోకడలను ఇంకా కొనసాగిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ అంశంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్, డిసిహెచ్‌లకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, రెండు నెలలుగా రోగులు ఫిర్యాదులు చేస్తున్నారని, అందుకే ఆకస్మిక తనిఖీలు చేపట్టానని అన్నారు. ఆమెతో పాటు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, తమ్మినేని గంగారాం పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎఎంసిలో దోపిడీ!

చెక్‌పోస్టు వద్ద అనధికార వ్యక్తుల నగదు వసూళ్లు

చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపేందుకు సిద్ధంగా ఉన్న ప్రయివేటు వ్యక్తులు

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల ఎఎంసిలో భారీ దోపిడీ జరుగుతుంది. ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా ఇక్కడ వ్యవహారం సాగుతుంది. ఆదపాక కూడలి సమీపంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయంలో అంతా ఇక్కడ కార్యదర్శి కనుసన్నల్లోనే భారీ దోపిడీ జరుగుతుంది.

ఎచ్చెర్ల మండలం చిలకపాళెం జాతీయ రహదారిపై ఎఎంసి ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ కేంద్రం నడుస్తోంది. ఇక్కడ 24 గంటలు ధాన్యం, పత్తి, మొక్కజొన్న, కాయగూరలు, నీలగిరి, సరుగుడు తదితర పంటల రవాణా జరిగే వాహనాల నుంచి ఎఎంసి ఆధ్వర్యాన సెస్ రూపంలో పంట రవాణా చేసే వాహనాలను మార్కెట్ కమిటీ సిబ్బంది నిలుపుదల చేసి రసీదులు ఇచ్చి నగదు వసూలు చేస్తారు. అయితే ఇక్కడ ఎఎంసి సిబ్బంది కాకుండా ప్రైవేటు వ్యక్తులే నగదు వసూళ్లు చేస్తున్నారు. వారికి నచ్చినంత వాళ్ల వసూలు చేసి కొంత కమిటీకి కడుతున్నారని సమాచారం. ఒక నెలలో రూ.20 లక్షలు వసూళ్లు చేస్తే రూ.4 నుంచి రూ.5 లక్షలు చూపించి మార్కెట్ కమిటీకి చెల్లిస్తున్నారని ప్రచారం సాగుతుంది. దీంతో సుమారు రూ.15 లక్షలు వరకు చేతివాటం చూపిస్తున్నారు. ఇటీవల ఇక్కడ అక్రమ వసూళ్లు, అనధికార వ్యక్తులు వసూళ్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని వారి జేబుల్లోకి వెళ్తుందన్న విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరావు ఎఎంసి కార్యదర్శి వాణి ప్రసన్న, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు వరకు మార్కెట్‌కమిటీకి సెస్‌ల రూపంలో రూ.40 లక్షల 38 వేలు ఆదాయం చూపించారు. నవంబరు ఒక్క నెలలో చెక్‌పోస్టు వద్ద పత్తి, వరి, నీలగిరి, సరుగుడు పంటల ద్వారా సెస్ రూపంలో రూ.5 లక్షల 14 వేలు ఆదాయం వచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. దాదాపు ప్రతినెలా భారీ దోపిడీ జరుగుతుంది. ఈ దోపిడీ కార్యదర్శి కనుసన్నల్లోనే జరుగుతుంది.

ప్రయివేట్ వ్యక్తులతోనే వసూళ్లు?

కార్యదర్శి వాణి ప్రసన్న ఇక్కడ కార్యాలయానికి విధి నిర్వహణకు వారంలో ఒక రోజు రావడం కష్టం. కంచిలి ఎఎంసి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఈమె వ్యవహరిస్తున్నారు. తరచూ విధులకు డుమ్మాకొడుతూ కలెక్షన్, వాటాల సమయంలో వచ్చి పంచుకుని వెళ్తుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన చిన్నికృష్ణ కోట్లలో అవినీతి చేసి కమిటీ నిధులు స్వాహా చేసిన ఘటనపై అరెస్టు చేసి విధుల నుంచి తప్పించారు. ఆ సమయంలో ఇక్కడ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న గొర్లె ఉమకు ఆ కుంభకోణంలో పాత్ర ఉందని రుజువవ్వడంతో ఆయననూ విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం అదే వ్యక్తితో పాటు మరో నలుగురు ప్రయివేటు వ్యక్తులను చెక్‌పోస్టు వద్ద సెస్ వసూళ్లకు కార్యదర్శి నియమించారు. వీరంతా రోజూ వసూళ్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతున్నారు. సోమవారం చెక్‌పోస్టును ప్రజాశక్తి విలేకరి ఉదయం 10.30 గంటల సమయంలో పరిశీలించగా విధుల నుంచి తొలగించిన గొర్లె ఉమాతో పాటు మరో ప్రయివేట్ వ్యక్తి రమేష్ వాహనాల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు కనిపించింది. మార్కెట్ కమిటీకి చెందిన అధికారులు, ఉద్యోగులు ఒక్కరు కూడా లేరు. తామే వసూళ్లు చేస్తామని, రోజుకు ముగ్గురు విధులు నిర్వహిస్తామని తెలిపారు. అయితే అక్కడ ఏ వ్యక్తి వసూళ్లు చేస్తే అదే పేరుతో రసీదు ఇవ్వాలి. అయితే ఎక్కడా రసీదు పుస్తకం కనిపించలేదు. మొత్తం ప్రయివేట్ వ్యక్తులను పెట్టుకుని నెలకు సుమారు రూ.20 లక్షల పైబడి మార్కెట్ కమిటీ ఆదాయాన్ని దోచేస్తున్నారు.

ఖాళీ కుర్చీలే దర్శనం

మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి, సూపర్ వైజర్, సిఏ, ఒక అసిస్టెంట్, ఒక అటెండర్, వాచ్‌మెన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా సిఏ, ఎఎంఎస్‌లు మాత్రమే కనపడతారు. మిగిలిన ఉద్యోగుల సీట్లు మాత్రం ఖాళీగానే ఎప్పుడూ కనిపిస్తాయి. దీనిపై జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ జరుగుతున్న అవినీతికి అడ్డుకట్టు వేసి ప్రభుత్వ ఆదాయం పరుల జేబుల్లోకి వెళ్లకుండా చూడాలని, కోరుతున్నారు. చెక్‌పోస్టు వద్ద ప్రయివేట్ వ్యక్తులు, తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సెస్ వసూళ్లు చేస్తున్నారని కార్యదర్శి వాణి ప్రసన్నను వివరణ కోరగా, తాము ప్రయివేట్ వ్యక్తులను పెట్టలేదని, గార్డు సన్యాసినాయుడుకు డ్యూటీ వేశామని, తెలిపారు. ఆయన భోజనానికి వెళ్లి ప్రయివేట్ వ్యక్తులను పెట్టి ఉంటారని అన్నారు. ఉదయం 10.30 గంటలకు భోజన సమయమా? అని ప్రశ్నించగా, తడబడుతూ మా గార్డును అడిగి చెబుతానని సమాధానమిచ్చారు. తాను ఈ రోజు ఎడి కార్యాలయానికి, సూపర్‌వైజర్ ఆడిట్ కార్యాలయానికి వెళ్లానని తెలిపారు.

ఎఎంసి కార్యాలయం

గుర్తు తెలియని మృతదేహం

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని పాతనౌపడ పంచాయతీ బంజీరుపేట వద్ద సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం సోమవారం లభ్యం కావడంతో కలకలం రేపింది. గ్రామంలో యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సిఐ అంబటి విజయకుమార్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారణంచారు. ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెద్దచెరువు సమీపంలో ఢీకొన్న నాలుగు కార్లు

నాలుగు కార్లు ఢీ : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు నారాయణ సాగరం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం నాలుగు కార్లు ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న క్రమంలో కార్లు ఒకదాని వెనుక మరోటి వెళ్తున్నాయి. బుడుమూరు నారాయణ సాగరం పెద్దచెరువు వద్ద రహదారి డివైడర్‌పై జాతీయ రహదారి అధికారులు గార్డెన్ పనులు చేయిస్తున్నారు. అక్కడ పనిచేసే పరిసరాల్లో స్టాప్‌ఫోల్స్ పూర్తిస్థాయిలో పెట్టాల్సి ఉండగా ఈ కార్లు ప్రయాణిస్తున్న రహదారిపై ఒకే ఫోల్ ఉంచడంతో మొదటి కారు ఆ స్టాప్ ఫోల్‌ను గమనించకపోవడంతో దగ్గరకి వచ్చేసరికి ఒక్కసారిగా చూసి కారు బ్రేక్ వేసి నిలుపుదల చేశారు. వెనుకనే వస్తున్న మరో మూడు కార్లు ఒకదాని వెనుక మరొకటి వరుసగా నాలుగు కార్లు ఢీకొనడంతో కార్లు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని కార్లు బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న మత్స్యశాఖ జిల్లా కార్యాలయం సూపరింటిండెంట్ ప్రవీణ్ కుమార్‌కు బెలూన్లు ఓపెన్ కావడంతో చేతికి స్వల్ప గాయమైంది. కారు నుజ్జు అయ్యింది. మూడో కారులో సుమారు 8 మంది కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్నారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. అదే ప్రక్క నుంచి వచ్చిన లారీలు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలిసి వెంటనే హైవే పోలీసులు, లావేరు ఎస్ఐ భుజంగరావు, సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేశారు.

ఇదీ కారణం...

రహదారిపై గార్డెన్ పనులు కూలీలు చేస్తున్నారు. అక్కడ పనులు చేస్తున్న కూలీలకు అవగాహన లోపంతో స్టాప్‌బోర్డులు ప్రయాణిస్తున్న రహదారిపై ఉంచడమే కారణం. డివైడర్‌పై కూలీలకు అవగాహన లేక రహదారి సూపర్‌వైజర్లు దగ్గర లేకపోవడంతో కూలీలకు ఎక్కడ ఎన్ని పెట్టాలి, ఎంత దూరంలో పెట్టాలో తెలియక ప్రమాదం జరిగింది. పని చేస్తున్న ప్రాంతంలో వరుసగా వాహనదారులకు కనిపించేలా, వారు దూరం నుంచి చూసేలా పెట్టాలి. దానికి వ్యతిరేకంగా పెట్టడంతో ప్రమాదం జరిగిందని చూసిన వారు చర్చించుకున్నారు. ఇకముందు ఇటువంటి ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

చట్ట ప్రకారం సమస్యల పరిష్కారం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను చట్ట ప్రకారం పరిష్కరించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుంచి 48 వినతులు స్వీకరించి వారితో మాట్లాడారు. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియజేసి బాధితులకు న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పలాస కేసులో మూలాలు వెతకాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రజల్లో భయాన్ని కల్పించడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని, పలాస పట్టణ టిడిపి అధ్యక్షుడు బడ్డ నాగరాజు హత్యకు కుట్ర పన్నడం అందులో భాగమేనని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నాగరాజు హత్యకు గురికాకుండా పోలీసులు అగంతకులను ముందే చాకచక్యంగా పట్టుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే డిజిపి, డిఐజిలతో మాట్లాడినట్టు తెలిపారు. అయితే ఈ కేసులో పట్టువారి కంటే సుపారీ ఇచ్చి రప్పించిన వారే అత్యంత ప్రమాదకరమని అన్నారు. దీనికి వ్యూహకర్త లెవరో నిగ్గుతేల్చడానికి మూలాలు కనుగొనాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందన్నారు. దీనివెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని అన్నారు. అలాగే జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల నీటమునిగి తడిసిన ధాన్యంలో రంగు మారినా, తేమ ఎక్కువగా ఉన్నా వాటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడవద్దని సూచించారు.

సైన్స్ పోటీలను విజయవంతం చేయాలి

టెక్కలి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించనున్న యూరేకా సైన్స్ ఎక్స్‌పో-2025 పేరిట వీడియో కాంటెస్టు పోటీలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు టెక్కలిలో పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొవాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, సుస్థిరాభివృద్ధి, మూడనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై ఈ నెల 22న నుంచి జనవరి 26 వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పాల్గొనే విద్యార్థులు వ్యక్తిగతంగా గాని, ముగ్గురు సభ్యులతో కూడిన బృందం గాని వీడియో చేసి గూగుల్ ఫారంలో నమోదు చేయాలన్నారు. వీడియో నిడివి 5 నిమిషాలకు మించరాదన్నారు. పాల్గొన్న విద్యార్థుల ప్రతిభ మేరకు బహుమతులు ఉంటాయని చెప్పారు. ఫిబ్రవరి 15న గెలీలియా జయంతి రోజున బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కన్వీనర్ పాలవలస ధర్మారావు, సభ్యులు కురమాన దాలయ్య, డొంకాన పాపారావు, రోణంకి విజయ్‌కుమార్, తమ్మినేని వైకుంఠరావు పాల్గొన్నారు.

జీపు విడి భాగాలను పరిశీలిస్తున్న వెంకటరమణ

ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక సామాజిక ఆస్పత్రిలోని ఆస్తులను కాపాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ సూచించారు. ఈ మేరకు స్థానిక సామాజిక ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలోని జీప్ మాయమై మిగిలి ఉన్న విడి భాగాలను పరిశీలించి వైద్యాధికారి కిషోర్‌కుమార్‌తో మాట్లాడి ఆరా తీశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేయకలేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే డిసిహెచ్‌ఎస్‌తో ఫోన్ మాట్లాడి సమాచారం అందజేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను సందర్శించారు.

రెవెన్యూ సదస్సులు రైతులకు వరం

ప్రజాశక్తి- బూర్జ

రైతుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దపేట పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేసేందుకు, పూర్తి హక్కులను కల్పించేందుకు, భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, కడగల కృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని కొత్తకోటలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎన్ని జోగారావు పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన భూముల రీసర్వేలో విస్తర్ణంలో తేడా, ఎల్‌పిఎం నెంబర్లు ఆక్రమణలు తదితర సమస్యలుంటే దరఖాస్తులు చేసుకొని సమస్యలు పరిష్కారించు కోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, మాజీ సర్పంచ్ మేడబోయిన శ్రీరామూర్తి, రొక్కం సాంబమూర్తి, మధు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న రామకృష్ణనాయుడు

పనులను పరిశీలిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులు వేగవంతం

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తామని టిడిపి మండల నాయకులు మదనాల జోగారావు అన్నారు. మండలంలోని ఉద్దానం గోపీనాథపురం పంచాయతీ మెళియపుట్టిలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిమెంట్ రహదారులను జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పనులు నాణ్యతలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. పంచాయతీ పరిధిలో 1050 మీటర్లతో ఐదు సిమెంట్ రహదారులు నిర్మానం చేపడుతున్నామని అన్నారు. వీటి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు నుంచి రూ.38 లక్షలు వెచ్చిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు మదనాల మోహన రావు, నగరంపల్లి నరేష్, బొమ్మాళి మహేష్, మల్లాన కృష్ణారావు, బచ్చల అప్పారావు, అంగ ఢిల్లి, నవీన్, రాజారావు, చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బూర్జ మండలం బోరగవలసకు చెందిన వికలాంగురాలు ధర్మవరపు ఆదిలక్ష్మి తన భూమిని రీ సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఇతరుల పేరు మీద నమోదు చేసారని, రెండు కాళ్లు లేని తాను పలుమార్లు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి ఫలితం లేకుండా పోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చింది. దీనిపై ఎమ్మెల్యే సంబంధిత విఆర్‌ఒతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఆదిలక్ష్మి భూమి రికార్డులను సరిచేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పలువురు రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే రవికుమార్‌కు అర్జీలు అందజేశారు. పలు గ్రామాల్లో పాఠశాలకు చెందిన భూములు ఆక్రమణకు గురైనట్లు పలు ఫిర్యాదులు అందాయని రెవెన్యూ అధికారులు వెంటనే సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఎమ్మెల్యే రవికుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని విఆర్‌ఒలకు ఈ ఆక్రమణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వివరాలు సమర్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని తహశీల్దార్ పి.రాంబాబును ఆదేశించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.16 లక్షల చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఆర్ఐ పప్పల గోవిందరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

భూ సమస్యను వివరిస్తున్న ఆదిలక్ష్మి

శిక్షణ ఇస్తున్న కూర్మారావు

స్వయం ఉపాధిపై శిక్షణ

మందస: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తీసుకున్న రుణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకునేటట్లు స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తున్నామని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని సొండిపూడి, మూలిపాడు పరిసర ప్రాంతాల్లోని మహిళలకు కొవ్వొత్తులు, డిటర్జెంట్ సర్ఫ్ పౌడర్, పినాయిల్ తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ విజయనగరం జిల్లా రాజాం జిఎంఆర్, నాగావళి గ్రామీణ ఉపాధి శిక్షణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాంబాబు, లక్ష్మి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు బాలకృష్ణ, కిషోర్, స్వామినాయుడు, విఒఎలు కుసుమ, తులసి పాల్గొన్నారు.

బిఆర్ఎయు ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటులో జాప్యం

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రాన్ని విభజించి పదేళ్లు కావస్తున్నా ఆంధ్రాలో ఇప్పటి వరకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. దీంతో నిరుద్యోగులు ఓపెన్ పరీక్షలు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతుంది. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు హైదరాబాద్‌లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉండేది. అప్పట్లో పలువురు చదువు మధ్యలో ఆపివేసిన నిరుద్యోగులు, చిరు ఉద్యోగాలకు ఎంపికై ఉద్యోగోన్నతికి చదవాలనుకునే వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందుబాటులో ఉండేది. కానీ, విభజన నేపథ్యంలో అప్పటి వరకు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించింది. తర్వాత ప్రవేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారికి ప్రవేశాలు నిలిపివేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, ఎంబిఎ, లైబ్రరీ సైన్స్ వంటి కోర్సులు చదువుకునేందుకు వీలుగా ఉండేది. కాగా, ఆంధ్రాలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు మాత్రం మన ప్రభుత్వం జీతాలు చెల్లిస్తుండడం విశేషం. ఆంధ్రాలో ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పలు నిరుద్యోగ సంఘాలు కోరినా, ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించి ఆంధ్రాలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వర్షం.. తీరని నష్టం

●ముంపులో పెసర, మినుము, మొక్కజొన్న ●ఉసూరుమంటున్న రైతులు

అల్లెనలో నీటిలో మునిగిన అపరాల పంట

అకాల వర్షాలతో రైతులు ఉసూరుమంటున్నారు. ఎన్నో ఆశలతో రబీ పంటకు సిద్ధమైన రైతులకు గుండెకోత మిగిలింది. నీట మునిగిన పెసర, మినుము, మొక్కజొన్న పంటలను చూసి రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

అకాల వర్షాలు మండల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు నిండా నష్టపోయిన రైతులు అపరాల పంటలోనైనా నష్టాలను పూడ్చేందుకు అపరాల సాగుకు సిద్ధమయ్యారు. మండలంలోని గుత్తావల్లి, మామిడివలస, లాభం, అప్పలపేట, పాలవలస, కొల్లివలస, కురుంపేట తదితర గ్రామాల్లో సుమారు 4,500 ఎకరాల్లో మినుము, పెసర, మొక్కజొన్న పంటలను పండించేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో జరిగిన నష్టాన్ని, చేసిన అప్పులను తీర్చుకునేందుకు పెసర, మినుము, మొక్కజొన్న పంటలవైపు ఇంటిల్లిపాది ఆరుగాలం పండించేందుకు రెయింబవళ్లు కష్టపడుతున్నారు. అయితే వారి ఆశలపైన వరుణుడు నీళ్లు జల్లాడు. ప్రస్తుతం మొక్క దశలోనే ఉన్న పెసరమైన గత 5 రోజులుగా కురిసిన వర్షాలకు పూర్తిగా నీటి మునిగిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మొక్కలు నీటిలోనే మునిగిపోవడంతో పూర్తిగా కుళ్లిపోయిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వల వలన రంగు మారి, కుళ్లిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు తెలిపారు. వ్యవసాయమే తప్ప మరో పని తెలియని రైతులు గంపెడు ఆశతో రబీ పంటల వైపు అడుగులు వేశామని, అయితే ఈ ఏడాది కూడా తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం పొలాల్లో నీరు వెళ్లిపోతే పంటలకు అంతగా నష్టం ఉండదని చెబుతున్నారని, అయినప్పటికీ సోమవారం కూడా చినుకులు పడుతుండటంతో పొలాల్లో నీరు అలాగే ఉందని రైతులు వాపోతున్నారు. మరోవైపు తడిసిన ధాన్యాన్ని దాచుకోలేక, అమ్ముకోలేక సతమత మవుతున్నారు. ప్రభుత్వం రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తానని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వర్షం కురువగా మరికొన్ని చోట్ల మబ్బుగానే వుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

వరికుప్ప చుట్టూ చేరిన వర్షపునీరు

సూచనలు పాటించాలి

విస్తారంగా కురుస్తున్న వర్షాలు కారణంగా పెసర, మినుము, మొక్కజొన్న వంటి పంటలు నీట మునిగిపోయిన మాట వాస్తవమే. అయితే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలి.

- ఎస్.శ్రీనివాసరావు, మండల ఎఒ

కొండముచ్చుల దాడిలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- కవిటి

గాయపడిన తరినమ్మ

మండలంలోని కపాసుకుద్దిలో సోమవారం కొండముచ్చుల దాడిలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఉదయం ఇంటివద్ద పనిలో ఉండగా కొండముచ్చులు గుంపుగా వచ్చి దాడి చేశాయి. ఈ దాడిలో టి.తరినమ్మ, కె.స్వప్న, బాలమ్మ, శాంతమ్మ గాయపడ్డారు. వీరికి కవిటి ప్రభుతాస్పత్రిలో చికిత్స అందించారు. మరోవైపు ఇటీవల మండలంలో కొండముచ్చులు యథేచ్ఛగా సంచరిస్తుండడం ఉద్యానవన పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కొండముచ్చుల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. వాటిని బోనుల ద్వారా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని ప్రాధేయపడుతున్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న యుగంధర్

కిరణ్‌కుమారికి అభినందనలు

సోంపేట : చీరలలోని ఫ్రైడే ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 21, 22న నిర్వహించిన రాష్ట్రస్థాయి లాక్టాస్ పోటీల్లో మామిడిపల్లికి చెందిన లండ కిరణ్ కుమారి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు అక్షర్ధ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుంది. ఆమె ఈ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈమెకు పాఠశాల చైర్మన్ యుగంధర్, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, శ్రీను, సిమన్, తండ్రి సూర్యనారాయణలు సోమవారం అభినందిస్తూ... ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎంఇఒ-2గా విశ్వనాథ్

ఇచ్ఛాపురం : స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ-2గా ఎస్.విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంఇఒ అప్పారావు ఒక్కరే బాధ్యతలు నిర్వహించారు. విశ్వనాథ్ మండలంలోని ధర్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ... ఉద్యోగోన్నతిపై ఎంఇఒ-2గా వచ్చారు. ఈయనకు ఎంఆర్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రైతులను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రకృతి సేద్యంతో రైతుకు గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రకృతి వ్యవసాయం వల్ల రసాయనిక ఉత్పత్తులకు దూరమై రైతుకు మంచి గుర్తింపు తీసుకొస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ త్రినాథస్వామి అన్నారు. ప్రపంచ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో శ్రీశ్రీ ఫౌండేషన్, వ్యవసాయ శాఖ, ప్రకృతి సాగు చేస్తున్న రైతులు కె..చంద్రమ్మ, ఎన్. చిరంజీవి, బి.జగ్గారావు, జగన్నాయుడు, ఎస్.అప్పారావు, వి.ఆదమ్మ, వి.సింహాచలం, చిన్నమ్మడు, కె.సింహాచలం, టి. కళ్యాణ కిషోర్‌లను సత్కరించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య వంతమైన పంటలను సాగు చేయడం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.రేవతి, టి.భవాని, శంకర రెడ్డి, వ్యవసాయ విభాగం కో-ఆర్డినేటర్ దార్లపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జగనన్న కాలనీకి తాగునీరు అందించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి మూడు రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. ఈ మేరకు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌ను సర్పంచ్ కాళ్ల సంజీవరావుతో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. విద్యుత్ మోటర్ పనిచేయకపోవడంతో మూడు రోజులుగా తాగునీరు అందడం లేదని వివరించారు. కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎం.సుందరి, పి.సరస్వతి, యు.నమిత, కె.లలిత, ఎన్.శ్రీదేవి పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గిరిజనుల యొక్క సాధక బాధలు, జీవనా విధానం, సంస్కృతులు, కష్టాలు తెలుసుకొని గిరిజన అభివృద్ధికి అండగా నిలిచిన వ్యక్తి డిప్యూటీ సిఎం, జనసేన అదినేత పవన్ కళ్యాణ్ అని జనసేన నాయకులు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సాలిసాన షణ్ముఖరావు అన్నారు. మండల కేంద్రంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి గిరిజన సంఘ నాయకులు, జనసేన నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గిరిజన మారుమూల ప్రాంతానికి వెళ్లిన ఏకైక వ్యక్తి పవన్ అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రూ.105.33 కోట్లతో గిరిజన గ్రామాల్లో రోడ్లు వేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు అండగా నిలబడిన వ్యక్తి పవన్ అని అన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి సవర రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్, పిట్ట హరికృష్ణ, దుక్క బాలరాజు, చంటి, నారాయణ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాడి

డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లు ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : డ్రగ్స్, మత్తు పదార్థాలు వల్ల కలిగే దుష్పలితాలపై విద్యార్థులు అవగాహన కల్పించే పోస్టర్లను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి సోమవారం ఆవిష్కరించారు. ఈ పోస్టర్లు అందరినీ ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, త్రిపాఠి, రాధ, దేవరాజ్ పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న వైద్యులు

పశువులకు టీకాలు తప్పనిసరి

కోటబొమ్మాళి: ప్రస్తుత సీజన్‌లో ఆవులకు గొంతు వాపు నివారణ టీకాలు తప్పని వేయాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజు సూచించారు. కోటబొమ్మాళిలో 68 ఆవులకు సోమవారం టీకాలను వేశారు. ఆవులను పెంచే యజమానులు ఈ విషయాన్ని గమనించి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎడి డాక్టర్ మంద లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

పలాస : అజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న డిఎస్‌పి, ఎడిఎ

ప్రజాశక్తి- రణస్థలం

నేలను నమ్ముకుని పలు రకాల ప్రతికూల పరిస్థితులను కూడా తట్టుకుని శ్రమిస్తూ పంటలు పండించి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే రైతన్నల కృషిని ప్రతిఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మండలంలోని వల్లభరావుపేటలో సోమవారం మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా 'జాతీయ రైతు దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించి భారత ప్రధాని పదవిని అలంకరించిన చౌదరి చరణ్ సింగ్ కృషి ఫలితంగానే దేశంలో జమిందారీ చట్టం రద్దయి కౌలుదారీ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. యువత ఉద్యోగాల పేరిట పల్లెలు వదిలి పట్టణాలకు తరలి పోతున్నారని, వ్యవసాయాన్ని కూడా ఒక వృత్తిగా స్వీకరించే దిశగా యువత ఆలోచన చేయాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు శ్రామికుల మధ్య మిత్ర అభ్యుదయ రైతు బి.సూర్యనారాయణ, గడి సూరయ్య ఇతర రైతుల చేతులమీదగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్త పి.రమణ, రైతులు పాల్గొన్నారు.

పలాస : దేశానికి వెన్నుముక రైతు అని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.వి.మధు అన్నారు. పవన్ పుత్ర సేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రపంచ రైతు దినోత్సవంలో భాగంగ3 12 మంది రైతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ఎంపిడిఒలు వసంతకుమార్, ఎన్.రమేష్ నాయుడు, వైద్యులు చిన్నంనాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, పవన్ పుత్ర సేవా సంఘం సభ్యులు కొల్లి ఫాల్గుణ, మజ్జి భాస్కరరావు, ఆసుపాన బాలకృష్ణ, బి.కిషోర్‌కుమార్, రుంకు తారకేశ్వరరావు, జనార్ధనరావు, అశోక్ పాల్గొన్నారు.

రణస్థలం : కేకు కట్ చేస్తున్న రైతులు

గణిత మేధావి రామానుజన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని భవిత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రాజెక్టులను విద్యార్థులు ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. పాఠశాలలో నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత, పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు కె.లక్ష్మి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రోజురోజుకూ గణితంపై పెరుగుతన్న ఆసక్తిని, అభిరుచిని దాని ఆవశ్యకతని గుర్తించాల్సిన అంశం ఉందని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు ఎం.అనురాధ అన్నారు. గణితం రామానుజన్ శ్రీనివాసన్ జయంతి సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గణిత సమస్య సాధనలో ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, పొట్నూరు జగదీష్, కాపల నారాయణరావు, పి.చిన్నారావు, జ్యోతి, బాడాన నారాయణరావు, సుధారాణి, రమేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యార్థులు

వజ్రపుకొత్తూరు : గణితంలో పట్టు సాధించిన విద్యార్థుల జీవిత గమనం ఉన్నత స్థాయి వైపు మారిపోతుందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 110 గణిత ప్రాజెక్టులను ప్రదర్శించి నిత్య జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. కె.హరిబాబు, గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు, గొల్లపల్లి లక్ష్మణరావు, రషీద్, ఉమామహేశ్వరి, సత్యరాజు, రాజశేఖర్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎఒ దుర్గాప్రసాద్

ప్రతి గింజా కొనుగోలు

కవిటి: రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగ పంచాయతీలో పాడైన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పడిపోయిన వరి చేనుపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. రంగు మారిన ధాన్యం కొంతమేర ఆరబెట్టుకోవాలని సూచించారు. రంగు మారిన ధాన్యాన్నీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడవద్దని సూచించారు. అనంతరం అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తేమ శాతం పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీకళ్యాణ్, సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి, వ్యవసాయ సహాయకులు అమూల్య, వినోద్ పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బొరివంక గ్రామస్తులు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్ ఆవరణలో బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 362వ రోజు సోమవారం దీక్షలో బొరివంక గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, త్వరితగతిన హామీలు నెరవేరిస్తే తమ విద్యార్థుల ఉన్నత చదువులకు, నిరుద్యోగుల కొలువులకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు పూర్తి న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నందిగాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నందిగాం మండల డిజిటల్ అసిస్టెంట్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కె.సుదేవరావు, సెక్రెటరీగా కె.పుష్పలత, జనరల్ సెక్రెటరీగా ఎ.శివశంకర్, ట్రెజరర్‌గా కె.షణ్ముఖరావు, అడ్వైజర్లుగా పి.మల్లేశ్వరరావు, సిహెచ్. ఉదయ్ కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గానికి సంబంధించిన వివరాలను ఎంపిడిఒ జి.రాజారావుకు అందజేశారు.

మాజీ మంత్రిని కలిసిన సిఐ

పలాస : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్వగృహంలో మాజీ మంత్రి గౌతు శివాజీను కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ పలాస ప్రాంతాన్ని ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

నగరవాసులకు వినోదం అందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర వాసులకు, చిన్నారులకు వినోదాన్ని అందించే ఎగ్జిబిషన్‌ను అందుబాటులో ఉంచడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని తుమ్మావీధిలో సోమవారం శ్రీ వెంకటేశ్వర ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్యులకు, మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేలా ధరలు ఉంచి వినోదాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. నగరవాసులకు వినోదం, ఆటవిడుపు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని ఈ స్థితిలో ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ అవసరమన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు పాటించడంతో పాటు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాలని నిర్వాహకులకు సూచించారు. భవిష్యత్‌లో నగర వాసులకు వినోదం పంచి ఉల్లాసంగా ఉంచేందుకు పార్కులను ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అరవల రవీంద్ర, నాయకులు, కార్యకర్తలు, ఎగ్జిబిషన్ మేనేజ్‌మెంట్ దుర్గాప్రసాద్, గోపి, శ్రీనివాసరావు, విస్సు, తారక్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వేతనాలు ఇప్పించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రిలో గతేడాది నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, ఇప్పటి వరకు ఒక్క పైసా జీతం అందలేదని, తమకు రావాల్సిన వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను సోమవారం కలిసి వినతిపత్రం అందజేసి తమ గోడును వినిపించారు. గతేడాది అక్టోబరు నుంచి 56 మంది విధుల్లో చేరమని, డిసెంబరు నెలలో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభించారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నామని, ఏడాది పాటు వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తూ గత ప్రభుత్వంలో నియామకాలు చేపట్టిందని, అయినా మీ బాధలను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు.

ఆప్కాస్ మీ పేర్లు నమోదు కాకపోవడంతో వేతనాలు మంజూరు కాలేదని, తాను అసెంబ్లీలో ప్రస్తావించన తర్వాత పేర్లు ఆప్కాస్‌లో ఎక్కించారని అన్నారు. త్వరలోనే మీ వేతనాలు వస్తాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాల కోసం తానూ ఏమి చేయలేనని స్పష్టం చేశారు.

చిన్నారులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలోని తిమ్మాపురానికి చెందిన ఉపాధ్యాయిని సంపతిరావు త్రివేణి ఇటీవల జాతీయ రహదారిపై కోటబొమ్మాళి వద్ద మరణించారు. సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులు గురుగుబెల్లి దామోదరరావు, సూర స్వర్ణకుమారి తిమ్మాపురంలోని ఆమె స్వగృహానికి వెళ్లి త్రివేణి ఇద్దరు కుమార్తెలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. త్రివేణి నాన్ లోకల్ టీచర్‌గా చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఆమె తల్లి ఆరోగ్యం బాగోలేనందున ఆమెకు చేదోడు వాదోడుగా ఉండేందుకు అంతర జిల్లాల బదిలీలో భాగంగా గతేడాది జిల్లాకు బదిలీపై వచ్చారని ఇంతలోనే ఇంత ఘోరం జరిగిపోయిందని వారు గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. త్రివేణి భర్త ప్రైవేటు బ్యాంకులో మెసెంజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న తరుణంలో విధి వక్రీకరించి ఘోరం జరిగిందని, త్రివేణి ఆత్మకు శాంతి కలగాలని వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చిన్నారులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రామారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వస్తువుల రూపేణా అన్యాయం జరిగితే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చునని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.రామారావు అన్నారు. సోమవారం కళాశాలలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి రెడ్‌మార్కు ఐఎస్‌ఐ గుర్తింపు ఉన్న నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూ ఎసి సమన్వయకర్త డాక్టర్ డి.పైడితల్లి, కో-కన్వీనర్ టి.శ్రీనివాసరావు, సమన్వయకర్త పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సీతారాం, వి.అచ్యుతరావు, టి.కాశీరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పవన్

పవన్

నరసన్నపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మరపట్ల పవన్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఎఫ్‌ఎసి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సురవరపు సత్యనారాయణ నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జంతుశాస్త్ర అధ్యాపకునిగా 20 ఏళ్ల పాటు పరవాడ, ఆమదాలవలస, శ్రీకాకుళం బాలురు, నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొందడంతో బాధ్యతలు చేపట్టారు. అధ్యాపకులు వదనగిరి, అప్పన్న, డాక్టర్ మల్లేశు, సోమశేఖర్, శాంతారావులు అభినందనలు తెలిపారు.

క్రయవిక్రయాలపై అవగాహన

టెక్కలి : సమాజంలో వినియోగదారులు తీసుకునే ప్రతి వస్తువుతో పాటూ క్రయవిక్రయాలపై పూర్తి అవగాహన ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరమని అన్నారు. ప్రతి కొనుగోళ్లపైనా తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అర్థశాస్త్ర విభాగం అధిపతులు రామారావు, కోటేశ్వరరావు, హేమరాజు, త్రినాథరావు, తేజోవతి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సంఘ సభ్యులు

లక్ష్మణ్ కుమార్‌కు సన్మానం

పలాస : అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్ మండలంలోని బొడ్డపాడులో అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు సోమవారం సన్మానించారు. అగ్నికుల క్షత్రియ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, సింహాద్రి బొడ్డు, బొడ్డు దుష్యంత్, బుడత ధనరాజ్, గర్తం తులసీరావు, తామాడ రామారావు, తామాడ అప్పారావు, బొడ్డు మోహనరావు (నాయుడు), తామాడ శ్యాం, పోతనపల్లి చిరంజీవి, గర్తం ఈశ్వరరావు, బుడత కాంతారావు, బత్తిని వాసుదేవ్ బొడ్డు శ్రీనివాస్, బొడ్డు దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఒక మోడల్‌గా తీర్చిదిద్దుదామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించారు. సమవేశంలో పిసిని జగన్నాథంనాయుడు, ముప్పిడి సురేష్, లెంక ప్రభాకర్, పిన్నింటి మధుబాబు, బూరాడ రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న శివాజీ

మాజీ మంత్రి పరామర్శ

పలాస : టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు స్వగృహంలో సోమవారం మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించి ధైర్యాన్ని ఇచ్చారు. హత్య ప్రయత్నం చేసేందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. నీ వెంట పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎప్పుడు ఏ సమయంలో ఎటువంటి అవసరం వచ్చినా తాము మీ వెంట ఉంటామని చెప్పారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. సోమవారం మండలంలోని కొల్లివలసలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు, చెడు ప్రలోభాలకు గురికావద్దన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు, మత్తు పానీయాలకు బానిసలు అయిపోతున్నారన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.దేవేందర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రచయితల మహాసభకు ఈ-వేమనకు ఆహ్వానం

ప్రజాశక్తి- రణస్థలం

మహ్మద్ రఫీ (ఈ-వేమన)

ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలోని కె.బి. ఎన్ కళాశాలలో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు యువకవులకు కవితపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రముఖ కవి, రచయిత శ్రీకాకుళం కవితామయం వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీశ్రీ కళా వేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈవేమన)కు ప్రపంచ తెలుగు రచయితల సంఘం నుంచి ఆహ్వానం అందింది. గత నాలుగు దశాబ్ధాలుగా భారతి సాహితీ సంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షులుగా తెలుగు రక్షణ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఎందరో కవులకు స్ఫూర్తిగా, గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఉంటూ జిల్లాలో 42 గ్రంథాలయాలను స్థాపిస్తూ నిత్యం సాహితీ సేవలో ఉంటున్న ఈవేమనకు ప్రపంచ మహాసభల్లో సాహితీ ప్రముఖునిగా ఆహ్వానం రావడంపై పలు సాహితీ సంస్థలు, రచయితలు, కవులు హర్షం వ్యక్తం చేశారు.